కలసివచ్చిన కాలం

శ్రీ విద్వాన్ సాధన వీరస్వామి నాయుడు ఎం. ఏ.

1 వ రంగము

స్థలము:-పల్లెటూరిలో తలుపు తెఱచియుంచిన పూరియింటి ముందఱ.

కాలము:-డాడాపు మధ్యాహ్నము 12 గంటల సమయము:

[40 ఏండ్ల లోపల వయస్సు. పొలములో కష్టించి వచ్చు రైతు సుబ్బన్న ప్రవేశము]

సుబ్బన్న:-ఏయ్ !...(కొంచెమాగి) తలుపు తెఱచియుంది అమ్మా కూతురెక్కడికి పోయినట్టు? (విసుగుతో) ఏ...! చెవుడా! ఎండలో పొలాన కష్టపడి యింటికివస్తే యింటి యిల్లాలు ఏమి తొందఱగా ఎదురువచ్చి దప్పిక తీరుస్తుంది? అబ్బా! (నిట్టూర్పు)

వెంకమ్మ:-ఏమండీ! వస్తున్నా. (భయమున సంభ్రమమున)

సు:-వస్తూన్నానని పెండ్లి నడకతో రాగం తీస్తున్నావా? కాస్త మంచినీళ్లు తీసుకరా. మగవాళ్ల కష్టమే తెలియదీ ఆడవాళ్లకు. (కోపముతో తలగుడ్డ తీసి విసరుకొనును). (సుబ్బమ్మ లోపలకు పోవును). (వెంకమ్మ చిన్న చెంబున మంచినీళ్ల నందిచ్చును. సుబ్బన్న త్రాగి ప్రక్క తిన్నెపై కూలబడి) పొద్దున సద్దిపోసి వచ్చావు. మిట్ట మధ్యాహ్నమయింది. కష్టించి యింటికి వస్తే పలికే దిక్కే లేరు. నీ కెప్పుడూ పొయ్యితోనే. (కోపముతో) ఆ పిల్లదేదీ?

వెం:-(భయమున) నేనొక్కదాన్నే యింటి పనులు చేసికోవలసివచ్చా. ఊరికంతా ఒకే బావి. అందులో ఈ ఎండాకాలములో నీళ్లసలే లేవు. వంతుల ప్రకారము ఆ నాలుగు కడవలు నేనొక్కతేనె తెచ్చేటప్పటికింత సేపయింది. ఇంక మీరు రన్నాలకు వస్తారని ఆదరాబదరాగ పొయ్యి దగ్గఉంటిని అందుచే మీ కేక వినలేదు. పొరబాటయింది.

సు:-నీ వొక్కతేనంటావు - అమ్మాయి ఎక్కడికి పోయింది? ఈడొచ్చిన దాన్ని యెవరింటికిపోవద్దని చెప్పలేదా!

వెం:-అవును. మన అమ్మాయి కూడా పోనన్నది. నాకూ ఇష్టములేదు - కాని

సు:-కాని... గద్దవచ్చి తన్నుకొని పోయిందా? ఏమిటే నీ అయోమయము?

వెం:-ఏమిలేదు. అమ్మాయితో చిన్నప్పటి నుండి చదువుకొన్నది - కల్యాణి మన

మునసబుగారి కూతురికి తేవు శ్రీ వెంక టేశ్వరస్వామివారి సన్నిధిలో పెండ్లి గాదండీ! ముందుగ ఈ ప్రొద్దే పెళ్లి కూతురిని తీసుకొని పోతారట! ఆ అమ్మాయే నేరుగా మనయింటికి ప్రొద్దున వచ్చింది. ఒక పేపట్టు పట్టింది పెళ్లికి తిరుపతికి రమ్మని.

సు:-ఆc... కాశీ రామేశ్వరముకూడా ఊరేగించు.

వెం:-ఊరికనే కోప్పడుతారు.

సు:-లేదు లే – నీ ఏడ్పు కానీ.

వెం:-ఈ ఏడ్పులకు భయపడే నా తల్లి యిల్లు గడప దాటననినది...కల్యాణి కళ్ల నీళ్లు పెట్టుకొంది. ఇంటి దాక రమ్మని బ్రతిమలాడింది. పసుపు కాళ్లతో పోతుంది. దాని అచ్చట ముచ్చట ఎట్లుండో? నేనే పొమ్మని మన రాధ నంపినాను.

సు:-రాధనంపినావు (విసుగు) దాని బాధ నీకేమి తెలియును? ఆడుదానవై పుట్టావు!

వెం:-మొగాళ్లు మీరున్నారు. ఆడవాళ్లు మేమేం చేసేది?

సు:-అందఱూ మొగాళ్లమే. గ్రామమునసబు పేరంటే ఉళ్ళోహడల్. పొలాల్లో చెట్టుచేమ, కసవు గట్ర, చెఱువులో చేపలు——అన్నీ ఆయనవే! అప్పచెల్లలు మొగుడుచచ్చి యింటిమీద ఇల్లువచ్చి పడింది! ఊళ్లోవాళ్ల వెట్టి చాకిరితో పుట్లకు పుట్లు ధాన్యం పండిస్తారు. పుట్టి కేదుము లెక్కను సాలుకు రెండు నాములు తీస్తాడు. ఆయనకేం కుబేరుడయ్యాడు! ఈ పాపాలు కడిగేసుకునేందుకు వెంకటేశుని ముందఱ కొమార్తెకు పదివేల రూపాయల కట్నమిచ్చి పెండ్లి చేయించి యిస్తున్నాడు.

వెం:-అవునండీ వెంట్రుకలున్నమ్మ ఏ కొప్పయినా పెడుతుంది.

సు:-మనగతి?

వెం:-ఏదో మనకు తగినవాళ్లు మనకుండరండీ? మీదంతా చోద్దెం!

సు:-చూస్తున్నావుగా మనబిడ్డ యీడేరి ఏడాది అయింది. ఏరీ మనకు తగిన వాళ్లు? ఒక్కరైనా వచ్చారూ?

వెం:-అంతా వస్తారు. మన బిడ్డకేంతక్కువ? అందాల రామచిలుక! ఈ కాలానికి తగినట్లు చదువుకొన్నది. సినిమా పాటలు పాడుతుంది. పల్లెటూరికి పట్నవాసానికి పనికి వస్తుంది.

సు:-అన్నీ ఉన్నవి. అల్లుడే తక్కువ (నిట్టూర్పు).

వెం:-ఔను ఊరకే వస్తాడా యీ కాలం అల్లుడు? అధమపక్షం ఒక సైకిలో... చేతి గడియారమో అయినా యివ్వద్దా?

సు:-ఆఁ సరే. అప్పుడే అల్లుడిగారికి వకాల్తా పుచ్చుకొన్నావా ? నీ యిద్దఱి కొడుకుల నే గంగలో త్రోస్తావు ? ఇంకా పుట్టే పిల్లలకు ?

వెం:-(సిగ్గుతో) వాళ్లు మొగాళ్లు. వాళ్ల ఱెక్కలపైన వాళ్లు బ్రతుకుతారు... ...ఆఁ...జ్ఞాపకానికి వచ్చినది. వారికి కట్నాలు రావటండీ ?

సు:-వస్తాయి - ఎప్పుడో ఏళ్ళు పొల్లుకొని వస్తాయని యిప్పుడే చెఱువుకట్ట తెగ వేయమంటావు. ఉన్న కాస్త కట్నమిచ్చి అడుక్కుతింటే— అల్లుడాదరిస్తాడా ?

వెం:-ఏమండి నే నంత తెలివి తక్కువదాన్నా ? నలుగురాడిన ఆట మన మాడకపోతే మనబిడ్డ గతి ?

సు:-ఏమో దానిగతి యెట్లున్నదో ? ఈ కఱవు కాలములో మన ఱెక్కలాడితే గాని డొక్కలాడడము లేదు.

వెం:-భయపడకండి. అన్నిటికీ వెంకటేశుడే ఉన్నాడు. లేవండి భోజనానికి (అవనిక)

2-వ రంగము

స్థానము:-తిరుపతిలో ఒక పెండ్లి సత్రము.
కాలము:-రాత్రి.

[పెండ్లి జనము సందడి-మంగళవాద్యములు]

రామయ్య: అబ్బాయీ! పెండ్లికొడుకయ్యా! పెండ్లి పీటల మీదికి రమ్మంటున్నారు వారు. లగ్నము వస్తుందట.

వరుడు:-కట్న మేదండీ ?

రా:-మునసబుగారు మాట తప్పరండి. ఇస్తారులెండి. మూడుముళ్లు కానివ్వండి

వ:-ఆ యిచ్చేది యిప్పుడే యివ్వమనండి- ఇంకా ఎప్పుడు ఇచ్చేది ? మునసబుగారయితే మాకేమి ?

రా:-కోపపడకండి బాబయ్యా! శుభకార్యములు చల్లగా జరుగవలెను. నూఱు కాలాల పంట ?

వ:-అవును కాబట్టే మా సంసారము చల్లగా నుండాలంటే ముందుగా కట్నమిచ్చి మాట నిలబెట్టుకోమనండి.

రా:-సరే లెండి. మునసబుగారూ! ఏరీ ? లేరే. ఉక్కకు బయట వీధి యరుగున నున్నట్లున్నది. వారికీ సంగతి చెప్తా. (నిష్క్రమణము)

[మునసబు—రామయ్య ప్రవేశము]

మునసబు; ఏమి రామన్నా! పను లన్నీ జరుగుచున్నవా ? మీరంతా చేతినిండా బలగమున్నారు పనులు చేయుటకని నేనిక్కడ కొంచెము ఆరుబయట గాలి మేయుటకు వచ్చాను. అబ్బే యిక్కడ వన్నీ బోడి మిద్దెలే. బోలెడద్దె పుచ్చుకుంటారుగాని సుఖమేలేదు. ఇదేనా తిరుపతి క్షౌరం!

రా:-చిత్తం. అన్నీ బాగానే జరుగుచున్నవి కానీ, చూచారా మీ యల్లుడిగారి ప్రవర్తన ?

ము:-ఏమి రామన్నా? నాకేమి రత్నము లాంటి పిల్లవాడు బి. ఏ. చదువు చున్నాడు.

రా:-అవును లెండి చదువునకు—సంస్కారానికి చాలదూరము లెండి పదిమంది సభలో మీ పరువు మర్యాదలు మంట గలుపు తున్నాడు.

ము:-(ఆశ్చర్యమున) ఏమీ - నా పరువు మర్యాదలా? అప్పుడే! ఏదో చెప్పేది సూటిగా చెప్పు.

రా:-ఏమీ లేదు. మీరిస్తామన్న పదివేల కట్నము వాడి మొగాన ఇప్పుడే పెట్టాలంట! పురోహితులు పెండ్లి పీటల మీదికి సన్నద్ధులుకండి అని హెచ్చరించగా ఈ యెదురు సవాలు చేస్తున్నాడు. ఏదో నక్క కొమ్ము దొక్కి మీ అల్లుడు కాబోతున్నాడు. ఇంతలో ఇంత గర్వమా?

ము:-రామయ్యా! అట్లనకు, రోజులు తల్లకిందులైనవి. ఎంతయినా ఆడ పిల్లలు గలవారము. అందులో కాస్త కలవారము. అందఱికీ మనపైనకన్ను! మా కల్యాణికి యీడుజోడు కుదిరింది. పోనీ పద. ఇప్పుడే పైకం ఇచ్చేద్దాం.

రా:-ఏమి కాలం మండిపోతుందండి! మీరు లక్ష్మీ పుత్రులు కాబట్టి రెండు వేలు పెట్టి దేవేంద్రవైభవంగా నారంగా యని పెండ్లి చేయిస్తున్నారు. ఇప్పుడే కట్నము పదివేలు రూపాయల్లు కాగితాల కట్టలు పెండ్లి కొడుకు మొహాన పారేస్తారు. రేపు కొంపదీసి మాబోటి మధ్యరకపు కుటుంబస్తుల పీకలు తెగిపోతాయి బాబూ.

ము.-నీవు చెప్పేది నిజమే. ఇప్పుడు యువకులు-ముఖ్యముగా చదువుకొన్న యువకులు కట్నాలకు దాసులైపోతున్నారు. మా అంతస్తుకు ఇంత కట్నమియ్యకపోతే తగిన వరుడు రాడాయె. ఏం చేసేది రామయ్యా? బిడ్డల కొఱకు ఇంత డబ్బు తగలేస్తుండాను.

రా:-అవును లెండి. తమవంటి వారికి వేలు దమ్మిడీలు. మాబోటివారికవే ప్రాణసంకటాలు. ఏదో పులిని జూచి నక్క వాతలు వేసుకొన్నదట! అట్లా ఉంది మాగతి. సరే పురోహితులు తొందఱ జేస్తున్నారు. పదండి. పదండి లోపలికి. (తెర)

౩-వ రంగము

స్థలము:-మొదటి రంగమువలె ఇంటిలోపల
కాలము:-సాయం సమయము.

[సుబ్బన్న - వెంకమ్మ ప్రవేశము]

సు:-ఏమే! నిన్న నేడు పెండల కడనే మోట కట్టాడా సేద్యగాడు?

వెం:-ఏమో? నేను సద్ది ఎత్తుకొని పొయ్యే

వేళకు మోటతోలుచుండినాడు.

సు: అవును ఈకొంపలో నేను లేకపోతే ఆ మాత్రము చీకటితో సేద్యగాడు పనికి వచ్చినాడా లేదా? గమనించేదిక్కే లేదు. మొగపిల్లలేమో పసికుడ్డులు.

వెం:-సరేగాని మీరు పోయిన పని పండా కాయా?

సు:-నీకేమి తొందరతే?

వెం:- నాకు తొందరతే. ఎదిగిన బిడ్డకు ఎన్ని మనువులు! దాని స్నేహితురాలు కల్యాణికి కల్యాణమై ఆరు నెలలయింది. కానుపుకు మూడో నెలలో రాబోతుంది. మన అమ్మాయిని తలుచుకుంటే కడుపు తరుక్కపోతుంది (స్వరభేదము)

సు:-ఏమిటే నీ కడుపుమంట? నీ కూతురికి పెండ్లి కాలేదనా? ఈ వరకట్నాల పోటీలో మన యిల్లు-పొలము అమ్మినా మన అమ్మాయికి పెండ్లి చేయలేమేమో? (అని స్పృహతో)

వెం:-ఏమండీ అట్లా నిరాశగా మాట్లాడుతారు?

సు:-నిరాశగాక ఏమున్నది?

వెం:-ఇంతకు పిల్లవాని తల్లిదండ్రు లేమన్నారు?

సు:-ఏమంటారు? మింగను మెతుకులేక పోయినా మీసాలకు సంపెంగనూనె కావాలంటారు.

వెం:-అంటే వారేమి సంపన్నులుగారా?

సు:-అబ్బే మనకంటే కనాకష్టము! ఉన్న రెండెకరాలపై రెండువేలు అప్పు.

వెం:-అయితే అబ్బాయిని బస్తీలో ఎట్లా చదివించారండీ?

సు:-ఇదిగో మనబోటి ఆడపిల్లల కన్నవారిని వేటాడిచంపను. ఈ కాలంలో చదివించేవారికంతా యిదే తెగులు. వాడేమో బీదవాడనని చెప్పుకుంటూ వారాలుతిని చదివాడట!

వెం:-బలే మంచి తెలివైనవాడే.

సు:-ఔను. తెలివైనవాడేలే!

వెం:-బీదవాడు కాబట్టే ఏదో ఉపాయంతో చదివాడుగదండి. ఎంతవరకు చదివాడటండి?

సు:-ఇంటర్ చదివి పరీక్షతప్పాడట.

వెం:-అయ్యో పాపం! ఏదైనా ఉద్యోగములో ప్రవేశించకూడదా?

సు:-లేదట. ఈ పరీక్ష వెనుక ఇంజనీరింగు వెళ్లతాడంట.

వెం:-అదెన్నేళ్లు చదవాలండి?

సు:-ఐదేళ్లు.

వెం:-అమ్మో చాలకాలమే. అవునండీ ఇంజనీరు మంచి ఉద్యోగముకాదండీ?

సు: ఆఁ. చాల మంచిది. రెండు చేతులా సంపాదించుకోవచ్చు.

వెం:-అయితే మన అమ్మాయిని ఎట్లయినా యీ అబ్బాయికే యివ్వాలండి.

సు: బాగానేఉంది నీ పిచ్చి. అప్పుడే ఆయన ఇంజనీరయినట్లు - నీకు అల్లుడయినట్లు.

వెం:-ఏమండీ అట్లా అంటారు? ఇంత చదివించినవారు ఆ కొంచెము చదివించలేరూ?

సు:-అఘోరించినట్లేఉంది నీ తెలివి. ఆ చదివింపులు మనం చదివించాలట. పెండ్లికి అదే షరతు. పై నెలలోనే మనమే పెండ్లిచేసి యివ్వాలంట. అప్పటినుండి పిల్లవానిని ఇంజనీరును చేయవలసిన బాధ్యత మనదేనట. ఏమంటావ్? నచ్చిందా?

వెం:-చదువున కెంతడబ్బు అవుతుందండీ?

సు:-దాదాపు పదివేలవుతుందని తెలిసినవాళ్లు చెప్పారు.

వెం:-అమ్మో పదివేలే? ఎన్ని జన్మాలకు సంపాదించేది?

సు:-మరి ఇంజనీరే అల్లుడుకావాలంటివే ఇంతకుముందు?

వెం:-మీ కెప్పుడూ వేళాకోళమే? ఏదో మన బిడ్డకు తగిన కట్నమిచ్చి కాస్త చదివినవాళ్లకు ముడిపెడదామనే ఆశతో అన్నాను. ఇవేమి తలకుమించిన కట్నాలండీ?

సు.-అవును. కాలస్వభావము నీకు తెలియలేదు. కాళ్లరిగేటట్లు ఎన్ని ఊళ్లు తిరిగాను? చదువుకొన్న వరుడి గిరాకీ యిట్లా మండిపోతుంది?

వెం:-అయితే ఏంచేదామండీ?

సు:-చేసేదేమిటి? మనసుంటే మార్గమే లేదా?

వెం:-అయితే ఎక్కడనో నిశ్చయముచేసికొని వచ్చారన్నమాట!

సు:-అనుకూలమైన స్థలమే. కాని నిశ్చయముచేయలేదు. అది మీ అమ్మ-కూతురు అంగీకారముమీద.

వెం: ఆడపిల్ల భారము మోయలేమండి. ఈ చదువుకొన్నవారితో మనం వేగలేము. ఏదో మనమాదిరి మట్టిపిసుకుకొనేవానికే - మంచివాడయితే - యిచ్చేదామండీ.

సు:-ఆలారా దారికి. నీవు చెప్పేది నిజమేనా?

వెం:-ముమ్మాటికి నిజమే.

సు:-అయితే అమ్మాయి అభిప్రాయము కనుక్కో.

వెం:-దానికేం. సత్యకాలపుపిల్ల, దానికిది యిష్టమే. మన కష్టాలు చూడ

లేక నాకిదివరలోనే చెప్పింది

సు-అయితే మన అమ్మాయికీ శ్రావణ మాసములోనే పెండ్లి. నిన్న వస్తూ వస్తూ రామాపురములో మన పాత చుట్టాలు లే. మూడవతరములో కలసినారు. కోటప్పకొండుక్కి మాట యిస్తామా?

వెం.-సరే పెండ్లయితే చాలు. కట్నమెంతో?

సు:-కట్నములేదు గిట్నములేదు. కట్నాలులేకుండా ఎలా పెండ్లిచేసి చూపిస్తానోచూడు!

వెం: నిజమేనా?

సు:-తప్పకుండ మీ యనుమతికొఱకే తిరిగి వచ్చాను. రేపుదయమే రామాపురము వెళ్ళి ముహూర్తము పెట్టుకుంటాము.

వెం:-అబ్బా! ఎన్నాళ్లకు కాలం కలసి వచ్చిందండి!

ఒకాయన తన 10 ఏళ్ల మేనల్లునితో "చెల్లాయికి బళ్లో యిన్ని బహుమానాలువస్తే నీకు కనీసం ఒక యోగ్యతాపత్రమైనా లభించనందుకు నీవు సిగ్గుపడాలి" అన్నాడు.

"లేదుమామా! నాకు ఒక యోగ్యతాపత్రము వచ్చింది."

"ఎప్పుడు? - ఎందుకుగాను?"

"నేనీ లోకంలో పుట్టినందుకు"

♦ ♦ ♦

ఒక ఉపాధ్యాయుడు తరగతిలో పాఠము చెప్పుతూ విద్యార్థులను "ఘనీభవించని ద్రవపదార్థమునొకదానిపేరును మీలో ఎవరైనా చెప్పగలరా" అని అడిగాడు.

ఒక బాలుడులేచి "నేను చెప్తానండీ! - వేడినీళ్లు" అన్నాడు.

♦ ♦ ♦

ఒకాయన తన చిన్న కుమార్తెను "మనం భగవంతుడు మన అపచారములను క్షమిస్తాడని ఆశించే ముందు మనమేమిచేయాలి?" అని అడిగాడు.

"ముందు మనము పాపంచెయ్యాలి" అని అన్నది పిల్ల తటపటాయించకుండా.